క్లుప్తంగా

ఎన్టీపీసీ టౌన్‌షిప్ లోపలికి ప్రజలను అనుమతించాలి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్ సముదాయంలోకి వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలను అనుమతించకుండా ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన పోస్టాఫీసు, బ్యాంకు, పాఠశాలలు, దేవాలయాలకు వాడచీపురుపల్లి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వెళ్తుంటారని, కానీ ఈ మధ్య టౌన్‌షిప్ లోపలికి ప్రజలను వెళ్లకుండా సీఐఎస్ఎఫ్ జవాన్లు ఆంక్షలు విధించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎన్టీపీసీ ఏర్పాటుకు భూములిచ్చిన నిర్వాసితులకు ఇలాంటి ఆంక్షలు విధించడం దుర్మార్గమన్నారు. ప్రజలను టౌన్‌షిప్ లోపలికి ప్రవేశించే అవకాశం కల్పించడానికి ఎన్టీపీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కృష్ణంనాయుడు డిమాండ్ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


సీఐ అనిల్‌కుమార్

పరవాడ: నిబంధనలు అతిక్రమించిన మద్యం దుకాణ యజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని సబ్బవరం ఎక్సైజ్ శాఖ సీఐ డి.అనిల్‌కుమార్ హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకు మాత్రం అమ్మకాలు సాగించాలని, అంతకు మించి అమ్మకాలు సాగిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని చెప్పారు. అదే విధంగా మద్యం దుకాణాలను బడి, గుడులకు దూరంగా నిర్వహించాలని సూచించారు. నిర్ణీత సమయాలను విధిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే సహించేది లేదని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన


రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: గత నెల స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా బేస్ బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు కె.కుశ్వంత్, సత్యానంద్, నవనీత్ గుంటూరు జిల్లా యానాంలో త్వరలో జరగనున్న బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు, కోచ్ రాజేష్‌ను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

విద్యార్థులకు పరీక్ష ఫీజు వితరణ


విద్యార్థుల పరీక్ష ఫీజు వితరణగా అందజేస్తున్న జగన్నాథరావు

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు మంత్రి నారాయణమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు లయన్ మంత్రి జగన్నాథరావు స్థానిక జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 26 మంది విద్యార్థులకు పరీక్ష ఫీజుగా రూ.2016 వితరణగా అందజేశారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయునికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ జలకళ పథకంలో భాగంగా బిగించిన సోలార్ పంప్ సెట్

పథకం రాదు.. పైకం అందదు

- ఎన్టీఆర్ జలకళ ద్వారా బోరు మంజూరుకు రూ. 25 వేలు చొప్పున డీడీలు కట్టిన రైతులు
- పార్టీ విధేయులకే మంజూరు.. మిగిలిన వారికి రిక్తహస్తం
- బోర్లు రాక.. డీడీల సొమ్ము వెనక్కి ఇవ్వక అన్నదాతల విలవిల

సబ్బవరం మండలంలో గల 24 గ్రామ పంచాయతీలకు చెందిన దాదాపు 75 మంది రైతులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జలకళ పథకంలో బోరు కోసం రూ. 25 వేలు వంతున డీడీలు కట్టారు. అయితే వారిలో విధేయులు, అభిమానులైన కొంత మందికే బోర్లు మంజూరై మిగిలిన వారికి మంజూరు కాలేదు. దాంతో బోర్లు మంజూరు కాని మిగిలిన 43 మంది రైతులు తాము కట్టిన డీడీల సొమ్ము వెనక్కి ఇవ్వాలని కాళ్లరిగేలా బ్యాంకుల చుట్టూ నేటికీ తిరుగుతూనే ఉన్నారు.


రాయపుర అగ్రహారంలో బిగించిన సోలార్ బోర్ వెల్

సబ్బవరం: గత తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు సాగునీటిని అందించేందుకు ఎన్టీఆర్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టారు. మెట్ట ప్రాంతాలు, వర్షాధారిత పంటలు పండించే వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ పథకంలో అప్పట్లో పార్టీ విధేయులు, అభిమానులకు ప్రయోజనం చేకూర్చే విధంగా పరిమితంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. కొంత మందికి బోర్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు, మరి కొంత మందికి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి బోర్లు బిగించి సాగునీటిని అందించారు. ఈ పథకంలో బోర్లు పొందేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగి డీడీలు చెల్లించి నేటికీ బోర్లు గాని, చెల్లించిన డీడీల సొమ్ము గానీ వెనక్కి తిరిగి రాకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారే అధిక సంఖ్యలో ఉన్నారు.

75 మంది లబ్ధిదారులు..

సబ్బవరం మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 75 మంది వరకూ లబ్ధిదారులకు ఎన్టీఆర్ జలకళ పథకంలో భాగంగా సాగునీటి బోర్లు ఏర్పాటు చేసే విధంగా రైతులను ఎంపిక చేశారు. వీరిలో కొంత మందికి కాంట్రాక్టర్లు బోర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ లైన్లు అందుబాటులో లేని చోట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి బోర్లు బిగించి రైతులకు అందజేశారు.

32 మంది రైతులకే బోర్లు మంజూరు..

మండలంలో సుమారు 75 మంది వరకూ రైతులకు ఎన్టీఆర్ జలకళ బోర్లు మంజూరయ్యాయి. వీరిలో **వెనుకబడిన కులాలు, తరగతులకు చెందిన రైతుల నుండి రూ. 25 వేలు, షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన రైతుల నుండి రూ. 5 వేలు చొప్పున బ్యాంకు డీడీలు కట్టించారు. వీరిలో** సుమారు 32 మంది రైతులకు మాత్రమే బోర్లు ఏర్పాటయ్యాయి. మిగిలిన 43 మంది రైతులు గత ఆరు సంవత్సరాలుగా తాము చెల్లించిన డీడీల సొమ్ము కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నేటికీ తిరుగుతూనే ఉన్నారు. అప్పటి ప్రభుత్వంలో ఒక్కో బోర్‌కు యూనిట్ విలువ రూ.80 వేలుగా నిర్ధారించి కాంట్రాక్టర్లకు అప్పజెప్పడంతో విద్యుత్ లైన్లు ఉన్నచోట బోర్లు ఏర్పాటు చేసి రైతులకు అప్పగించారు. అదే విధంగా తక్కువ లోతులో పడే బోర్లు సైతం ఏర్పాటు చేసి సోలార్ ప్యానల్స్ బిగించి బోర్లు ఏర్పాటు చేశారు. ఎక్కువ లోతులో బోర్లు పడే చోట కాంట్రాక్టర్లు బోర్లు వేయలేదని రైతులంటున్నారు.

బోర్ కోసం కట్టిన సొమ్ము రాలేదు..



ఆరేళ్ల క్రితం ఎన్టీఆర్ జలకళ పథకంలో బోర్ మంజూరు కావడంతో రూ.25 వేలు బ్యాంకు డీడీ తీశాం. అయితే ప్రభుత్వం మాకు బోర్ ఏర్పాటు చేయలేదు. బోర్ రాకపోవడంతో తీసిన డీడీల సొమ్ము తిరిగి ఇవ్వాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అయినప్పటికీ మేము చెల్లించిన సొమ్ము రాలేదు.

– పిల్లల అప్పలనాయుడు, రాయపుర అగ్రహారం గ్రామం, సబ్బవరం మండలం.

డ్వామా కార్యాలయానికి లేఖ రాశాం..



ఎన్టీఆర్ జలకళ పథకంలో భాగంగా 6 సంవత్సరాల క్రితం కొంత మంది రైతులు డీడీలు తీసినా, వారికి బోర్లు రాలేదని, అలాగే డీడీల సొమ్ము వెనక్కి రాలేదన్న సంగతి నా దృష్టికి వచ్చింది. ఒక్కో రైతు రూ. 25 వేల వరకూ డీడీలు తీశారు. వీరికి ఆ సొమ్ము మొత్తం తిరిగి చెల్లించాలని డ్వామా కార్యాలయానికి 20 రోజుల క్రితం లేఖ ద్వారా తెలిపాం.

– పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం మండలం.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి


రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ తదితరులు

సబ్బవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని టిక్కలిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కలిపాలెం గ్రామంలో 739 ఖాతాలకు గాను మొత్తం 795.93 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో 266.73 ఎకరాల ప్రభుత్వ భూమి, 529.20 ఎకరాల జిరాయితీ భూమి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంప అప్పారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష, మండల సర్వేయర్ లాలం అప్పారావు, గ్రామ పెద్దలు పైల రమణ, పంచాడ శ్రీను, రెవెన్యూ సిబ్బంది రాంబాబు, ఇందిర, వీఆర్వో కామరాజు, ఎం. గోవిందరావు, డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15న షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త కోటేశ్వరరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక చెరకు కాటా వద్ద కొలువైన శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 15వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామివారి ఆలయం వద్ద వార్షికోత్సవ వేడుకల గోడపత్రిక అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా గ్రామ పెద్దలు, ప్రజల సహాయ సహకారాలతో ఈ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల కోలాట పోటీలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధ, సాయంత్రం దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఎ. సూర్యనారాయణ, మాస్టర్ బుద్ద నరసింహమూర్తి, బండారు వెంకట రమణ, పొలమరశెట్టి అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఘనంగా పవిత్రోత్సవాలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి


హోమం చేస్తున్న అర్చకులు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వెంకన్నకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం పూజలు జరిపారు.

ముందుగా విశ్వక్షేన పూజ, రక్షా బంధనం, రుత్వింగ్వరణం, అగ్ని ప్రతిష్ఠ, శాత్తుమొరై నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు రూ.60,000 జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పై విధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధిలో శుక్రవారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వెంకటాద్రి ఘాట్ రోడ్డు సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి, యోగా కేంద్రం నిర్మాణానికి దొగ్గవానిపాలెంలో సామాజిక భవనం నిర్మాణానికి నల్ల క్వారీ ప్రధాన రహదారి నిర్మాణానికి దుర్గ ఆదర్శనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఒనల్ల క్వారీ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు కాలువల నిర్మాణానికి.. ఇలా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

93వ వార్డులో..

సింహాచలం: పెందుర్తి నియోజకర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ. కోటీ 58 లక్షల అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, వార్డు టీడీపీ అధ్యక్షుడు గంగ వరహాలు, వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు తామాడ ఆదిబాబు, బీజేపీ అధ్యక్షుడు కె.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి సీఎంఆర్ఎఫ్ నిధులు

పెందుర్తి: నియోజకవర్గ పరిధి పెదగంట్యాడ అప్పికొండ ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు తైనాల అప్పారావుకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. చికిత్స కోసం కేర్ ఆస్పత్రికి ఎల్‌వోసీని అప్పారావుకు శుక్రవారం పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందజేశారు.

సాంకేతిక నైపుణ్యం పెంపుదల అవసరం

అగనంపూడి: సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడానికి పారిశ్రామిక సందర్శనలు ఎంతో దోహదపడతాయని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. కళాశాలకు చెందిన ఈసీఈ విభాగం విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా శుక్రవారం డీఆర్‌డీవోను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి ఇటువంటి సదస్సులు, సందర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఈసీఈ డీన్లు రమేష్ బాబు, నాగజ్యోతి, రవికుమార్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


దేవతా మూర్తుల వేషధారణలో కళాకారులు

మల్కాపురం: కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక కళా వేదిక వద్ద ప్రముఖ కోలాట నృత్య కళాకారిణి ఆకుల లోవ రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగమ్మ, పద్మావతి ఇతర దేవతామూర్తుల వేషధారణలో నృత్య కళాకారులు శ్రీనివాసుడి కల్యాణం పేరిట ప్రదర్శన చేపట్టారు. అద్భుత ప్రదర్శనతో కళాకారులు వీక్షకులను మెప్పించారు.

కూటమి చేతిలో మోసపోయిన ప్రజలకు అండ



జీవీఎంసీ 95, 97 వార్డుల ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతి అంశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ 95, 97 వార్డుల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదారు నెలల వ్యవధిలోనే ప్రజావ్యతిరేకతలో రికార్డు సాధించిందని ఎద్దేవా చేశారు. దానిని కప్పిపుచ్చుకునేందుకే సీఎం, డీసీఎం రోజుకో డ్రామా ఆడుతున్నారని అన్నారు. కూటమి చేతిలో దగా పడ్డ ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయా వార్డుల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవాలు విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న వెంకటరావు, అయిత సింహాచలం తదితరులు

పెందుర్తి: ఆర్‌కే బీచ్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు పిలుపునిచ్చారు. చినముషిడివాడలో పెందుర్తి నియోజకవర్గ యాదవ సంఘం ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పెందుర్తి నుంచి భారీ ఎత్తున ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. పలు అంశాలపై సంఘం ప్రతినిధులతో చర్చించారు. జిల్లా యాదవ సంఘం కార్యదర్శి అయిత సింహాచలం, నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉగ్గిన కనకరాజు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు


వాడచీపురుపల్లిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు


నాయుడుపాలెంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వరలక్ష్మి, అధికారులు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఉప సర్పంచ్ కె. శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. నాయుడుపాలెంలో సర్పంచ్ కె.వరలక్ష్మి సీతారామయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి త్రినాథ్, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, మధు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నివారణ


క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

పరవాడ: మత్తుపదార్థాల వినియోగం, మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కనక అప్పారావు తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఊబకాయం, ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం వల్ల నోటి, లంగ్, పాంక్రియాస్, పేగు, రొమ్ము గర్భసంచి, ప్రోస్టేట్, లివర్, బ్రెయిన్, చర్మ, బ్లడ్ క్యాన్సర్ల బారిన పడే అవకాశం అధికంగా ఉందన్నారు. పొగాకుతో పాటు మత్తు పదర్థాలను వెంటనే మానేసేలా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ వి. సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 22 లక్షల మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. ఉల్లాస్ పేజ్–1లో భాగంగా వీరిలో 4 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 15 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళా నిరక్షరాస్యులను గుర్తించి వారికి ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల వద్ద విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకోవాలని వినతి

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి వెస్ట్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 398/15లో ఆక్రమణలకు గురైన 0.34 సెంట్ల ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసవరపు అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పరవాడ తహసీల్దారు ఎస్వీ అంబేద్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ స్థలాన్ని ప్రజలు శ్మశాన వాటికగా ఉపయోగించేవారన్నారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించడం వల్ల శ్మశాన వాటికకు స్థలం లేకుండా పోయిందన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనపరుచుకుని శ్మశాన వాటికకు కేటాయించాలని అప్పారావు డిమాండ్ చేశారు.



